క్లుప్తంగా

'జగనన్న ఆరోగ్య సురక్ష' జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

గాజువాక : త్వరలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం చేయడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం కోరారు. వైద్య, ఆరోగ్య సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీనికోసం ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు ఈ నెల 15 నుంచి ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా భావించాలన్నారు. కార్యక్రమంలో గాజువాక పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యకు ఊంజల్ సేవ


శ్రీకృష్ణునికి ఉయ్యాల సేవ చేస్తున్న అర్చకులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 కొండపై వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని శుక్రవారం వేడుకలు జరిపించారు. అందులో భాగంగా శ్రీ కృష్ణుడికి ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ జనన వృత్తాంతం వివరించారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థగోష్టి నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి రాజశేఖర్‌కు ఎమ్మెల్యే నాగిరెడ్డి పరామర్శ


మంత్రి రాజశేఖర్‌తో ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రాజశేఖర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారి లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్మిక నాయకులు మహేష్‌రెడ్డి, పాడి త్రినాథ్, యు.వి.రామస్వామి తదితరులున్నారు.

అగనంపూడి టోల్‌గేటు నిబంధనలకు విరుద్ధం

అగనంపూడి: జీవీఎంసీ పరిధిలో ప్రజలకు భారంగా మారిన అగనంపూడి టోల్‌ప్లాజాను వెంటనే ఎత్తివేయాలని సిటూ నాయకులు డిమాండ్ చేశారు. లంకెలపాలెం కూడలిలో సిటూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జి.సత్యనారాయణ మాట్లాడుతూ హైవే నిబంధనలను కాలరాస్తూ జీవీఎంసీ పరిధిలో అగనంపూడిలో టోల్‌ప్లాజాను కొనసాగించడం దారుణమన్నారు. జీవీఎంసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కె.అర్జునరావు, గోవిందరావు, సూర అప్పారావు, వెంకటేష్, అప్పారావు పాల్గొన్నారు

రక్తదాన శిబిరం నేడు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలో ముత్యాల హారం ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ కిడిమి హనుమంతరావు తెలిపారు. అగనంపూడిలో స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి రహదారిలో సూర్య టవర్స్ ఎదురుగా నిర్వహించనున్న ఈ శిబిరంలో దాతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివరాలకు 93461 24555, 98483 79334 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ ప్రదాత జగనన్న

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- వైఎస్సార్‌సీపీ నాయకులు వెల్లడి
- లబ్ధిదారులకు కొత్త పింఛన్ల పంపిణీ


అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న దృశ్యం


74వ వార్డులో మహిళకు పెన్షన్ అందిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు.

- జీవీఎంసీ 74వ వార్డు దల్లివానిపాలెం సచివాలయంలో లబ్ధిదారులకు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కొత్త పింఛన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వార్డులో అర్హత కలిగిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు 41మందికి కొత్త పింఛన్లు అందజేస్తున్నామన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కిందన్నారు. అర్హులైన లబ్ధిదారులను ఏ ఒక్కరినీ వదలకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా జల్లెడ పట్టి మరీ సకాలంలో సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. వృద్ధాప్య పింఛన్లు 2, దివ్యాంగ పింఛన్లు 3 మంజూరైనట్లు సిబ్బంది తెలిపారు. వాటిని వార్డు సచివాలయ సెక్రటరీలు, వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ బండారు శ్రీనివాస్, ఎడ్మిన్ మున్నీనా, వైఎస్సార్ సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, నంబారు రాజు తదితరులు పాల్గొన్నారు.

85వ వార్డులో..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ కాలనీలో కొత్తగా మంజూరైన పింఛన్లను కార్పొరేటర్ చేతుల మీదుగా అందించారు. నిర్వాసిత కాలనీలోని లేమర్తి, బోనంగి, ఏదురువానిపాలెం కాలనీలకు చెందిన 17 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు పరిధిలోని అర్హులందరికీ పింఛన్లు అందించామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.


ఫార్మాసిటీ కాలనీలో పింఛన్లు అందిస్తున్న కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి

అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 75వ వార్డులో రూ.61 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 75వ వార్డులోని పలు ప్రాంతాల్లో రూ.61 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతానగరం ఎస్సీ కాలనీలో రూ.6లక్షలతో కాంపౌండ్ వాల్, సీతానగరం సచివాలయ పరిధిలో రూ.20 లక్షలతో కల్యాణమండపం, రజక వీధిలోని దుర్గాదేవి ఆలయం వద్ద రూ.15 లక్షలతో మినీ కల్యాణ మండపం, సీతానగరం నూకాలమ్మ ఆలయం వద్ద రూ.20 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మించనున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నక్క వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వార్డు కార్పొరేటర్ పులి ఝూన్సీ లక్ష్మీబాయ్, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గొందేశి శ్రీనివాసరెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ ఎం.చిన్న, కొయ్య భారతి, పులి రమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, వంశీకృష్ణ యాదవ్, వెంపాడ అప్పారావు, ప్రభాకర్ రెడ్డి, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కణితి హైస్కూల్లో విద్యార్థినులకు రక్త పరీక్షలు


విద్యార్థినికి రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

కూర్మన్నపాలెం: విద్యార్థినుల్లో రక్తహీనతను నివారించి, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు సంస్థల సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కణితి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశరావు తెలిపారు. హైస్కూల్లో విద్యార్థినులకు ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో సృజన సంస్థ సహకారంతో శుక్రవారం హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి కేంద్రీకరించగలరన్నారు. విద్యార్థినుల్లో చాలామందికి రక్తహీనత ఉంటోందని, దానికి చెక్ పెట్టేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ సంయుక్త జనరల్ మేనేజర్ కె.వి.సుబ్బారావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, సృజన సంస్థ సీఈవో మోహర్‌బాబా, ప్రాజెక్ట్ మేనేజర్ సుమతి, పాఠశాల పీడీ మన్నాజీ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో డైనింగ్ హాల్స్ ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: విద్యార్థుల సౌకర్యార్థం అదానీ గంగవరం పోర్టు, అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో డైనింగ్ హాల్స్ నిర్మించడం శుభ పరిణామం అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గంగవరం, దిబ్బపాలెం గ్రామాల్లోని ఎంపీపీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం కొత్తగా నిర్మించిన డైనింగ్ హాల్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు భోజనం చేసేందుకు వీలుగా డైనింగ్ హాల్స్ నిర్మించారని చెప్పారు. గంగవరం పోర్టు యాజమాన్యం ప్రతినిధులు మాట్లాడుతూ సమాజ సంక్షేమం, విద్యారంగం అభివృద్ధిలో భాగంగా డైనింగ్ హాల్స్ నిర్మించామన్నారు. గంగవరం ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ సెంటర్ ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో పోర్టు సీఈవో బి.జి.గాంధీ, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా నందోత్సవం


పండ్లరసాలతో స్వామి ప్రభుపాదకు అభిషేకం

బీచ్‌రోడ్డు:నంద మహారాజుకు పుత్రుడు జన్మించాడనే ఆనందంతో ప్రజలకు విందు ఇచ్చే నందోత్సవాన్ని శుక్రవారం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్ నిర్వహించిన ఈ నందోత్సవంలో శ్రీకృష్ణ భగవానుడికి రకరకాల వంటకాలతో నైవేద్యం సమర్పించారు. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా గురుపూజ

హరే కృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపక గురువు భక్తి వేదాంత స్వామి ప్రభుపాద జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సప్తనదుల నుంచి సేకరించిన జలాలు, పళ్ల రసాలు, పంచామృతం, పంచగవ్యాలతో అంగరంగ వైభవంగా అభిషేకం నిర్వహించారు. ప్రభుపాద జీవిత విశేషాలను హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించిన భక్తదాస భక్తులకు వివరించారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు తీరని నష్టం


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 939వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును అమ్మాలని చూడడం అన్యాయమన్నారు. దీనికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీపీ త్రివిక్రమ్ వర్మకు ఉత్కృష్ట సేవా పతకం

దొండపర్తి: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ప్రతిష్టాత్మక ఉత్కృష్ట సేవా పతకం లభించింది. ఆయనతో పాటు జిల్లాలో ముగ్గురు సీఐలను, ఒక ఏఎస్ఐతో పాటు 14 మంది హెచ్‌సీలు, 14 మంది కానిస్టేబుళ్లను ఈ పతకానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. అలాగే అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఒక ఎస్ఐతో పాటు 16 మంది హెచ్‌సీలు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపికైన వారు..

దువ్వాడ సీఐలు బి.శ్రీనివాసరావు, ఎ.వెంకటలీలారావు, ద్వారకా సబ్‌డివిజన్ క్రైం టి.ఇమాన్యుయల్ రాజు, కంచరపాలెం ఏఎస్ఐ కె.కనకరాజు ఉత్కృష్ట సేవా పతకాన్ని అందుకోనున్నారు. అలాగే హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.జీవన్‌కుమార్(సీఏఆర్), జి.వి.రమణ(గోపాలపట్నం ట్రాఫిక్), ఎం.బాలరాజు(పీఎం పాలెం క్రైం), టి.వసంతరావు(సీఎస్‌బీ), జె.ఎం.ఎం.రెడ్డి(పద్మనాభం), జి.శ్రీనివాసరావు(త్రీటౌన్), ఎస్.శ్రీనివాసరావు(దువ్వాడ), డి.సురేష్‌కుమార్(దువ్వాడ క్రైం), ఎ.రమేష్‌కుమార్(దువ్వాడ ట్రాఫిక్), పి.జయసీలన్ (ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్), జి.శ్రీహరి(మల్కాపురం), కె.ప్రసాద్(మల్కాపురం), టి.కామేశ్వరరావు(ఆనందపురం క్రైం)తో పాటు ఏసీబీ హెచ్‌సీ టి.కొండలరావు ఈ సేవా పతకానికి ఎంపికయ్యారు. అదే విధంగా కానిస్టేబుళ్లు జి.ప్రసాద్(ఏఆర్), కె.ఎస్.స్వామి(ఏఆర్), జి.శ్రీనివాసరావు(ఏఆర్), వి.దశరావు(ఏఆర్), ఎం.గోవిందరావు(ఏఆర్), పి.సన్యాసిరావు(ఏఆర్), ఎన్.బి.వెంకటేశ్వర్లు(వన్‌టౌన్ క్రైం), ఇ.మునిరాజు(ఏఆర్), ఎస్.ఎరిబాబు (ఏఆర్), బి.శ్రీధర్(ఏఆర్), ఎం.వీరబాబు(ఏఆర్), కె.చిన్నయ్య(ఏఆర్), ఎం.ప్రసాదరావు(ఏఆర్), పి.చిన్న బొజ్జయ్య ఎంపికయ్యారు.

అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన వారు..

న్యూపోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ పి.రాజు, హెచ్‌సీలు కె.వైకుంటరావు (ఏఆర్), ఆర్.మాధవరావు(ఏఆర్), టి.రాము (ఆనందపురం ట్రాఫిక్), జె.వెంకటరవి(ఏఆర్), పి.వరహాలు(దువ్వాడ), ఎ.రమణారావు(సీసీఎస్), జి.శ్రీనివాసరావు(టూ టౌన్ ట్రాఫిక్), కె.బాబా అమర్‌శేఖర్ (సీఎస్‌బీ), కె.ఈశ్వరరావు(గాజువాక క్రైం), వి.కనకరావు(ఏఆర్), ఎస్.కె.సుభాన్(సీఎస్‌బీ), జి.రామారావు(ఏఆర్), బి.ఎస్.మూర్తి(ఎంవీపీ)తో పాటు 16వ బెటాలియన్ హెచ్‌సీలు బి.రామానుజులు, పి.కోటేశ్వరరావు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌లో హెచ్‌సీ ఎం.సన్యాసిరావు ఈ పతకానికి ఎంపికయ్యారు.

వర్షాభావ పరిస్థితుల్లోనూ నిరంతర విద్యుత్

దొండపర్తి : వర్షాభావ పరిస్థితుల కారణంగా విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ ఆఫీస్ సమావేశ మందిరంలో హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి విశాఖలో అన్ని ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి పైగా వినియోగదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల కారణంగా అత్యధికంగా 1616 మెగావాట్ల విద్యుత్ వినియోగం రికార్డు అయినట్లు వివరించారు. విద్యుత్ లోటును సర్దుబాటు చేసేందుకు పరిశ్రమల విద్యుత్ వినియోగదారులకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో విద్యుత్ సరఫరా పరిస్థితి మెరుగుపడడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం ఎస్ఈజెడ్ నుంచి కొంత మంది హెచ్‌టీ వినియోగదారులు విద్యుత్ అంతరాయాలపై సందేహాలు వ్యక్తపరచగా వాటిని అధికారులు నివృత్తి చేశారు.

ప్రసాద్ పథకంతో సింహగిరికి మహర్దశ

రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ


ప్రసాద్ స్కీమ్ పనుల ప్రణాళిక పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.55కోట్ల ప్రసాద్ పథకం నిధులతో సింహగిరికి మహర్దశ పడుతుందని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ప్రసాద్ పథకం పనులకు సంబంధించి రూపొందించిన డీపీఆర్‌ను ఆయన శుక్రవారం సింహాచలం దేవస్థానంతో అధికారులతో కలిసి పరిశీలించారు. దేవదాయశాఖ, దేవస్థానం, టూరిజంశాఖ అధికారులతో పనులు జరిగే ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు పూర్తిస్థాయిలో వినియోగపడేలా అభివృద్ధి పనులు జరగాలని, అంతేకాని ఏ పనీ వృథాగా పోకూడదని సూచించారు. ఆలయ ఉత్తర ప్రాంగణంలో ఉన్న ప్రదేశంలో ఈశాన్యం మూలన యాగశాలను నిర్మించే విషయంపై వైదికుల సూచనలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. అలాగే ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న సువిశాల ప్రదేశంలో క్యూకాంప్లెక్స్ నిర్మాణంపై చేయాలా...వద్దా అన్న విషయంపై పరిశీలన జరిపారు. మాస్టర్‌ప్లాన్‌కు ఎలాంటి విఘాతం కలగకుండా పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. కొండదిగువ పురాతన పుష్కరిణి సత్రాన్ని తొలగించి ఆ స్థానంలో జీప్లస్–ఫైవ్ కింద ఆధునిక సదుపాయాలతో సత్రాలను నిర్మిస్తామన్నారు. పుష్కరిణి సత్రం మధ్యలో ప్రస్తుతం ఉన్న పురాతన మండపాన్ని అలేగే ఉంచుతామని తెలిపారు. 1936లో నిర్మించిన ఆగమ పాఠశాలను కూడా వేరే ప్రాంతంలో నిర్మిస్తామన్నారు.అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న భవనాన్ని ఆధునికీకరిస్తామన్నారు. ఈ సందర్భంగా వేద విద్యార్థులతో కొంతసేపు మాట్లాడారు. దేవస్థానం ఈవో కార్యాలయ భవనం కూడా పక్కాగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పాత అడవివరం వైపు నుంచి వచ్చే మార్గంలో ఉన్న రెండో టోల్‌గేట్ వద్ద సువిశాలమైన పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైన స్థలాన్ని పర్యాటకశాఖకు కేటాయిస్తామన్నారు. అలాగే సింహగిరిపై ఉన్న మ్యూజియాన్ని కమిషనర్ సందర్శించారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో త్రినాథరావు ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ సీఈ సీఎస్ఎస్ మూర్తి, ఈఈ రమేష్, జేఈలు మదన్‌మోహన్, సీతారామ్, దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఏడీసీ రామచంద్రమోహన్, డీసీ సుజాత, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, దేవస్థానం అధికారులు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్షీరాబ్ధి కన్యకకు సహస్ర శ్వేత పుష్పార్చన

- త్రిశక్తి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు
- నేత్రపర్వంగా శ్రావణ శుక్రవారం పూజలు


పెంటమాంబ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు, అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే నాగిరెడ్డి


త్రిశక్తి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు


కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


మహాలక్ష్మి అమ్మవారికి సహస్ర శ్వేత పుష్పార్చన


పూజలందుకున్న మహాదుర్గ అమ్మవారు


అగనంపూడి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

ఉక్కునగరం: క్షీరాబ్ధి కన్యక, శ్రీ మహాలక్ష్మిని సహస్ర శ్వేత పుష్పాలతో అర్చించారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్‌లోని త్రిశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహాదుర్గాదేవికి మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అంతకు ముందు శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ ఆధ్వర్యంలో సాయంత్రం శ్రీమహాలక్ష్మి అమ్మవారికి సహస్ర శ్వేత పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో భాగంగా కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం నక్షత్ర హారతులు, నీరాజన మంత్రపుష్పం సమర్పించారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు

పెదగంట్యాడ: 76వ వార్డు హౌసింగ్ బోర్డు సమీపంలోని కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని కుంకుమ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మొగలపల్లి త్రిమూర్తులు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కొల్లా అప్పలరాజు, బొండాడ వెంకటేశ్వరరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెంటమాంబ ఆలయంలో..: నెల్లిముక్కు గ్రామ దేవత పెంటమాంబ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలతో కుంకుమార్చనలు చేయించారు. కార్యక్రమంలో పులి రాజారెడ్డి, గొందేశి సత్యనారాయణ, ఈశ్వరరావు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

అగనంపూడి: 79వ వార్డు పాత అగనంపూడి శాంతి నగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేశారు. పూజల్లో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ మకుడి–సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో లైన్ సంబంధిత ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఈ నెల 20 నుంచి 25 వరకు విశాఖలో బయల్దేరే విశాఖ–న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 20నుంచి 25వ తేదీ వరకు న్యూఢిల్లీలో బయల్దేరే న్యూఢిల్లీ– విశాఖ (20806)ఏపీ ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 14, 21 తేదీల్లో బయల్దేరే విశాఖ–గాంధీదాం (20803) వీక్లీ ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 24న గాంధీదాంలో బయల్దేరే గాంధీదాం–విశాఖ (20804) వీక్లీ ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 22,25 తేదీల్లో విశాఖలో బయల్దేరే విశాఖ–హజరత్ నిజాముద్దీన్ (12803)స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 24న పూరిలో బయల్దేరే పూరి–ఓఖా (20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్, వార్ధా మీదుగా ప్రయాణిస్తుంది.

డ్వాక్రా మహిళలకు అవగాహన

అక్కిరెడ్డిపాలెం: డ్వాక్రా సంఘాల మహిళలకు ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. అమరావతి నుంచి వచ్చిన సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబులిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ (ఎస్ఎస్ఏఏటీ) బృందం పలు అంశాలను వారికి తెలియజేసింది. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఓటు వేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వారు వివరించారు. అనంతరం వారు సచివాలయ వీఆర్వో, బీఎల్‌వోల నుంచి వార్డులో ఓటర్ల సర్వే ఏ మేరకు పూర్తయిందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏఏటీ ప్రతినిధులు, సచివాలయం వీఆర్వో కమలి, బీఎల్‌వో గొంతిన వెంకట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకురాలు గొంతిన సత్యవతి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.